సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 12 । జూలై । 2025



ఉత్సాహంగా రెవెన్యూ క్రీడలు
జిల్లా స్థాయిలో రెవెన్యూ క్రీడలు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్ ఆనంద్ క్రీడలను ప్రారంభించారు. - 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,075
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,347
సవర (8 గ్రాములు)	రూ.74,776

వాతావరణం
గరిష్టం/కనిష్టం 39.3 /29.7
జిల్లాలో వాతావరణం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. శుక్రవారం గాలిలో తేమ 39 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

జలాశయానికి వరద ప్రవాహం



సోమశిల జలాశయం

సోమశిల: జలాశయం నీటి మట్టం పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీశైలం నుంచి జలాలు దిగువకు విడుదల చేసిన నేపథ్యంలో సోమశిలకు క్రమేణా నీటి ప్రవాహం రానుంది. శుక్రవారానికి ఆదినిమ్మాయపల్లి రెగ్యులేటర్ ద్వారా 1,131 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతున్నట్లు ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. మరికొన్ని రోజులు ఈ వరద ప్రవాహం ఇలానే కొనసాగితే 35 టీఎంసీలకు చేరుకునే అవకాశం ఉందని అధికారుల సమాచారం. ప్రస్తుతం జలాశయంలో 28.660 టీఎంసీలు ఉన్నాయి. పెన్నా డెల్టాకు 2,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

అభ్యసన సామర్థ్యాన్ని మెరుగు పరచండి

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: ప్రాథమిక తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగు పరిచేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు అందరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఓ. ఆనంద్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో విద్యార్థుల ప్రావీణ్యత గురించి నిర్వహించిన పరాఖ్ సర్వేక్షన్ సర్వే, 2024 ఫలితాలపై డీడీఈఓలు, ఎంఈఓలు, డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలెక్టర్ విస్తృతంగా చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధికారులందరూ కలిసి మోడల్ స్కూల్లో చదువుతున్న విద్యార్థుల్లో గుణాత్మక మార్పు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పిల్లల విద్యా సంబంధ విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల నాణ్యత ప్రమాణాలను పెంచాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మోడల్ స్కూల్స్‌లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహపడే విధంగా వాటిని తయారు చేయాలన్నారు. డీఈఓ బాలాజీరావు మాట్లాడుతూ గతేడాది జిల్లాలోని 108 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన 2,927 మంది విద్యార్థులు, 379 మంది ఉపాధ్యాయులు ఈ సర్వేలో పాల్గొన్నారన్నారు. ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా పిల్లలు స్వతహాగా ఈ సర్వేలో పాల్గొనేలా నిర్వహించామన్నారు. ప్రాథమిక తరగతుల నుంచి ఉన్నత పాఠశాల తరగతులకు వచ్చిన విద్యార్థుల్లో కొన్ని అంశాల్లో ప్రావీణ్యత తగ్గడం గమనించామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సమగ్రశిక్ష ఏపీఓ వెంకటసుబ్బయ్య ఇతరులు పాల్గొన్నారు.

అసమ్మతి రాగం.. అవినీతి రాజ్యం

- అవమానాలతో టీడీపీ మైనార్టీ నేత ఆత్మహత్యాయత్నం కలకలం
- షాడో ఎమ్మెల్యేల ఆధిపత్యం, అవినీతి ఆరోపణలు
- స్థానిక నేతలను విస్మరిస్తున్న ఎమ్మెల్యే
- నియోజకవర్గంలో నియంత పాలనపై విమర్శలు
- పోలంరెడ్డి వర్గాన్ని అణచివేస్తున్న షాడోలు
- చెలరేగుతున్న మాఫియా కార్యకలాపాలు

కోవూరు టీడీపీలో ముదురుతున్న వర్గవిభేదాలు

కోవూరు టీడీపీలో వలస నేతలు, షాడో ఎమ్మెల్యే ఆధిపత్యం అవినీతి, అక్రమాలు ఆ పార్టీలో వర్గ విభేదాలకు దారితీస్తోంది. ముఖ్య నేతల అసమ్మతి రాగాలు రచ్చకెక్కుతుండగా, అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. దశాబ్దాలుగా పార్టీ జెండాలు మోసిన నేతలకు సరైన గుర్తింపు, ప్రాధాన్యం లభించకపోవడంతో నాయకులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నియోజకవర్గాన్ని నియంత శైలిలో పరిపాలిస్తూ, ప్రతి మండలానికి షాడో నేతలను నియమించి, వారి ఆధారంగా పాలన సాగిస్తున్నారని పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో కోవూరు నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. హుందాతనం, గౌరవ ప్రద రాజకీయాలకు నేతలు ప్రాధాన్యమిస్తారు. కొన్ని దశాబ్దాలుగా అవినీతి, అక్రమాలకు తావు లేని ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం అధికార పార్టీ నేతలు అనేక మాఫియాలుగా అవతారమెత్తారు. ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం, చికెన్ వేస్ట్, పశువుల అక్రమ రవాణా, క్యాసినోలు, పేకాట క్లబ్బులు, మద్యం బెల్టుషాపులు.. ఇలా ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని అవినీతి, అక్రమాలకు తెగబడుతున్నారు. పాలనలో అనుభవం లేని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్థానికేతర వలస నాయకులను మండలానికొకరిని నియమించి అధిక ప్రాధాన్యత ఇస్తూ, స్థానిక నేతలను వెనక్కు నెట్టినట్లు తెలుస్తోంది. షాడోలుగా వ్యవహరిస్తున్న నేతలు అధికారంతో వ్యవహరిస్తూ స్థానికంగా ఉండే పాత నేతలపై ఎమ్మెల్యేకు పితూరీలు చెబుతూ తమ పబ్బం గడుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీకి సంక్షోభ కాలంలో అండగా నిలిచిన నేతలకు అధికారంలో ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీ అధిష్టానానికి సమస్యలు తెలియజేయాలన్న ఆశ లేకుండానే వేదనలో మునిగిపోతున్నారు. ముదివర్తికి చెందిన మైనార్టీ నేత ఇమామ్‌బాషా, పార్టీ నేతల నుంచి తాను అనుభవిస్తున్న నిర్లక్ష్యాన్ని మీడియా సాక్షిగా పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ పార్టీ నేతల మధ్య ఆధిపత్యం, అవినీతి, అక్రమాలు, వర్గ రాజకీయాలకు అద్దం పడుతోంది.



పార్టీపై ప్రేమాభిమానం ఎక్కువై ఇలా.. : అజీజ్

నెల్లూరు సిటీ: విడవలూరు మండలం ముదివర్తికి చెందిన మైనార్టీ నేత ఇమామ్‌బాషా ఆత్మహత్యాయత్నంపై రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ స్పందిస్తూ రాజకీయాల్లో ఇలాంటి మామూలేనని, సర్దుకుంటాయని చెప్పుకొచ్చారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులోని వేమిరెడ్డి నివాసంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, అబ్దుల్ అజీజ్ శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అజీజ్ మాట్లాడుతూ ఇమామ్‌బాషాకు పార్టీపై ప్రేమ, అభిమానం ఎక్కువై ఇలా చేశారంటూ కొత్త భాష్యం చెప్పారు. కొత్తవాళ్లు పార్టీలోకి వచ్చినప్పుడు నాలుగు రోజులు ఇటువంటివి జరుగుతుంటాయని, అన్ని సర్దుకుంటాయని చెప్పారు. ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఇమామ్‌బాషాకి, స్థానిక నేతలకు మధ్య పడ లేదన్నారు. భావోద్వేగంతో ఇమామ్‌బాషా ఇటువంటి చర్యకు పాల్పడ్డారని తెలిపారు.

రెచ్చిపోతున్న షాడోలు

ప్రతి మండలాన్ని స్థానికేతరులైన షాడోలు తమ గుప్పెట్లో పెట్టుకుని ఆ ప్రాంత వనరులను దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపణలు. ఆ మండలంలో ఆ షాడోలు చెప్పిందే వేదం. వారి ఆజ్ఞ లేనిది ఏ చిన్న పని కూడా కాదు. పోతిరెడ్డిపాళెం, మినగల్లు, ముదివర్తిలో బహిరంగంగా ఇసుక దోపిడీ జరుగుతోంది. మినగల్లు డంపింగ్ యార్డ్ నుంచి 12 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమంగా తరలించి భారీగా లాభం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. పెన్నానదిలో కూడా ఇసుక దోపిడీ కొనసాగుతోంది. ఇసుక, గ్రావెల్ దందాలతో పాటు క్యాసినోలు, పేకాట క్లబ్బులు, చికెన్ వేస్ట్, రేషన్ బియ్యం, బెల్టుషాపుల మద్యం మాఫియాలు చెలరేగుతున్నాయి.

ఇసుక, గ్రావెల్ మాఫియాలుగా పోలంరెడ్డి వర్గాన్ని అణగదొక్కే కుట్ర

2019 ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలిచిన, కీలక నేత పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వర్గాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అనూహ్యంగా పక్కన పెట్టారంటూ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. ఎన్నికల సమయంలో బుజ్జగించి ఉపయోగించుకుని, అనంతరం దూరంగా పెట్టడం తగదంటూ పలువురు నేతలు బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019 నుంచి వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పటికి ముదివర్తికి చెందిన మైనార్టీ నేత ఇమామ్‌బాషా టీడీపీనే తన జెండాగా పార్టీకి తోడుగా ఉన్నాడు. తన ఇంటిపై ధైర్యంగా పసుపు జెండా కట్టుకున్నాడు. అలాంటి నేతకు సైతం ప్రాధాన్యత ఇవ్వకపోవడం వెనుక ఆయన పోలంరెడ్డి వర్గంగా ముద్రపడటమే. పోలంరెడ్డి ముద్ర వేసి అతన్ని పక్కన పెట్టడంతో ఆయన తీవ్ర మనస్థాపానికి గురవ్వి చివరకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడాల్సి వచ్చింది.

ప్రశాంతమ్మ.. రాచరిక పాలన కాదు

- మాజీమంత్రిని కట్టేసి నీ కాళ్ల దగ్గర పడేయమంటావా?
- ఇది ప్రజాస్వామ్య పాలన అని గుర్తుపెట్టుకో
- వైఎస్సార్‌సీపీ మహిళా నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న మహిళానాయకులు

కోవూరు: మాజీమంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని 'కట్టిపడేసి నీ కళ్ల దగ్గర పడేయాలి' అంటవా?. ఇది రాజరిక పాలన కాదు, ప్రజాస్వామ్యం. ప్రజలే నీకు తగిన బుద్ధి చెబుతారు' అంటూ వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని హెచ్చరించారు. శుక్రవారం కోవూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద, అధికార ప్రతినిధి మల్లి నిర్మల, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు వేంకట జ్యోతి, కొడవలూరు ఎంపీపీ జ్యోతి, కోవూరు జెడ్పీటీసీ శ్రీలత, నేతలు సంపూర్ణ, షకీలా, ప్రవల్లిక, ఉమా తదితరులు మాట్లాడారు. ప్రశాంతమ్మ అహంకారంగా మాట్లాడుతున్న తీరు రాష్ట్ర ప్రజలందరికీ అసహ్యం కలిగేలా ఉందన్నారు. రాజ్యాధికారం మీద మత్తులో మాట్లాడే భాష అని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యం, ప్రజలే తగిన తీర్పు ఇస్తారన్నారు. ప్రసన్న ఇంటిపై దాడి జరిగి ఐదు రోజులు గడిచినా ఇప్పటికీ నిందితులను అరెస్ట్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లోకి చొరబడి కారు ధ్వంసం చేయడం, రూ.లక్షల విలువైన వస్తువులను ధ్వంసం చేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్యలని పేర్కొన్నారు.

బండారు మాటలు మరిచిపోలేరు

టీడీపీ నేత బండారు సత్యనారాయణ మాజీమంత్రి ఆర్కే రోజాపై అసభ్యంగా మాట్లాడిన మాటలు ఇప్పటికీ ప్రజలకు గుర్తున్నాయన్నారు. ఆ సమయంలో ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి న్యాయపద్ధతిలో వ్యవహరించిన తీరును గుర్తు చేశారు. అప్పుడు అదే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించారన్నారు. ప్రతి ఒక్కరికీ కుటుంబం ఉంటుందని, ఆ కుటుంబంలో అమ్మ, అక్కా, చెల్లెళ్లు ఉంటారనే విషయాన్ని ప్రశాంతిరెడ్డి కూడా గుర్తించాలన్నారు. మహిళగా ప్రశాంతమ్మ ఇతర మహిళల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ఉందని సూచించారు. దివంగత మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి జిల్లాకు గొప్ప పేరు తీసుకొచ్చారని, ఆయన భార్య శ్రీలక్ష్మమ్మ దాడి సమయంలో ఇంట్లో ఉండడాన్ని కూడా బేఖాతర్ చేయకపోవడం చూస్తే వీరి అరాచకానికి అద్దం పడుతుందన్నారు. జిల్లాలో ఒకే ఒక మహిళా ఎమ్మెల్యే ఉన్నప్పుడు మహిళలకు మేలు జరుగుతుందనుకున్నారు. కానీ ఆమె పేరులో ప్రశాంతి ఉన్నా.. చర్యల్లో మాత్రం అశాంతి కనబడుతోందని వ్యాఖ్యానించారు.

పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

పార్టీ సమావేశం జరుగుతుందని తెలుసుకుని ముందుగానే పోలీసులు అక్కడికి చేరుకోవడంపై నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారు ఎవరో తెలిసినా ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. న్యాయం జరగకపోవడంతో కోవూరు సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించేందుకు ర్యాలీగా వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమావేశంలో పలు గ్రామాల మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

అవకాశమిచ్చి.. అధికారం కట్టబెడితే..

- కాసులకు కక్కుర్తిపడి పచ్చకండువా కప్పుకున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్

ఇందుకూరుపేట: రాష్ట్రంలోనే మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళకు అవకాశమిచ్చి.. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ అధికారం కట్టబెడితే.. ఇప్పుడు టీడీపీ నేతల ప్రలోభాలకు తలొగ్గి పచ్చకండువా కప్పుకున్నారు. మండలంలోని మైపాడు గ్రామానికి చెందిన శ్రీహరికోట జయలక్ష్మి ఇందుకూరుపేట జెడ్పీటీసీగా వైఎస్సార్‌సీపీ తరఫున అప్పటి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గెలిపించారు. మత్స్యకార సామాజిక వర్గానికి గుర్తింపు కల్పించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమెకు సముచిత స్థానం కల్పించాలని నెల్లూరు జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలుగా ఎన్నుకోవాలని నేరుగా ఆదేశించారు. దీంతో ఒక్కసారిగా ఆ సామాజిక వర్గంలో ఎప్పుడూ లేని విధంగా ఈ హోదా దక్కడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది.

తాజాగా టీడీపీలో చేరిక

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జయలక్ష్మి శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో పచ్చకండువా కప్పుకుంది. అందుకు ఆమెను భారీ మొత్తంతో ప్రలోభ పెట్టినట్లు ఆ సామాజికవర్గంలో చర్చ జరుగుతోంది. మైపాడుకు చెందిన టీడీపీ నేత దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి నేరుగా ఆమెను తన కారులో ఎక్కించుకొని ఎమ్మెల్యే నివాసానికి తీసుకెళ్లి కండువా కప్పించినట్లు తెలిసింది. మత్స్యకారులను గుర్తించి ఈ పదవి ఇచ్చారని, కానీ నమ్మక ద్రోహం చేస్తూ జయలక్ష్మి డబ్బుకు అమ్ముడుపోయి తమకు తీరని మచ్చను తెచ్చారని మత్స్యకార నాయకులు పలువురు విచారం వ్యక్తం చేశారు.



కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జయలక్ష్మి

దుర్గంపల్లి వీఎస్ఎస్ చైర్మన్‌కు రసవత్తర పోరు

- ఈ కమిటీపై పట్టుకు అటవీశాఖలో ఓ దిగువ స్థాయి అధికారి ప్రయత్నం
- నేడు ఎన్నికలకు ఏర్పాట్లు

ఉదయగిరి: దుర్గంపల్లి వనసంరక్షణ సమితి (వీఎస్ఎస్)లో కొన్నేళ్లుగా అటవీశాఖాధికారులకు కాసులు కురిపిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి ఏడాది కొత్త ప్లాంటేషన్లతోపాటు అధిక ఆదాయం ఇచ్చే వనరులు మెండుగా ఉన్నాయి. వీఎస్ఎస్‌ను అడ్డం పెట్టుకుని అటవీశాఖలో పనిచేసే ఓ దిగువ స్థాయి అధికారి గత 15 ఏళ్ల నుంచి రూ.కోట్లు సంపాదించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది బదిలీలు ఉన్నా.. ఉన్నతాధికారుల అండతో ఇక్కడే తిష్ట వేశారు. ఇక్కడ పనిచేసే ఎఫ్‌బీఓ, సెక్షన్ అధికారి పేరుకు మాత్రమే.. అన్నీ ఆ దిగువ స్థాయి అధికారి తానై వ్యవహరిస్తుంటారు. కింది స్థాయి అధికారుల నుంచి పైస్థాయి అధికారులకు వరకు అన్నీ అవసరాలు తీర్చుతూ పట్టు సాధించారు. ప్రస్తుతం ఈ వీఎస్ఎస్‌లో 5 లక్షలు మొక్కలు పెంచే నర్సరీ ఉంది. రూ.కోటి నిధులు ప్లాంటేషన్ పనులు కోసం అందుబాటులో ఉన్నాయి. గతం నుంచి ఈ వీఎస్ఎస్ కమిటీని డమ్మీ చేసి పెద్ద మొత్తంలో కొట్టేశారని వీఎస్ఎస్ సభ్యులే ఆరోపిస్తున్నారు. వీఎస్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో నడవాల్సిన నర్సరీలో చాలా మందికి వీఎస్ఎస్‌కు సంబంధం లేని వ్యక్తులు పెత్తనం సాగిస్తున్నారు. ఆ అధికారి తనకు అనుకూల కూలీలను ఉపయోగించుకుంటూ వీఎస్ఎస్ సభ్యుల పొట్టకొట్టుతున్నారనే విమర్శలు ఉన్నాయి. తాజాగా చైర్మన్ చనిపోవడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో శనివారం వీఎస్ఎస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఈ క్రమంలో చైర్మన్ కోసం పలువురు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ అధికారి తమకు అనుకూల చైర్మన్ ఎన్నిక కోసం తీవ్ర కృషి చేస్తున్నారు. పలువురు అధికార పార్టీ నేతలను ఆశ్రయించారు. కమిటీ సభ్యులకు నగదు, మద్యం పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిజాయితీ, చట్టబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వీఎస్ఎస్ సభ్యులు కోరుతున్నారు.


జనం కళ్ల ముందే వ్యక్తి దారుణ హత్య

- హంతకులు బావ, బావమర్దులు
- ఫంక్షన్ హాల్ ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం
- పలువురు చూస్తుండగానే కత్తితో పొడిచిన వైనం



రక్త మడుగులో హమీద్

ఉదయగిరి: ఉదయగిరిలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న అల్‌ఖైర్ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి జనం చూస్తుండగానే ఓ దారుణ హత్య జరిగింది. కల్యాణ మండపం ఆర్థిక లావాదేవీల విషయంలో బావ, బావమర్దుల మధ్య నెలకొన్న విభేదాలే ఈ హత్యకు కారణంగా మారింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. ఉదయగిరికి చెందిన హనీఫ్, కొండాపురం మండలం గరిమెనపెంటకు చెందిన హమీద్ (38) (హతుడు) పెద్దమ్మ కూతురును వివాహం చేసుకున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న హమీద్ ఉదయగిరిలో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో హనీఫ్, అతని సోదరుడు ఉమర్‌తో కలిసి హమీద్ ఫంక్షన్ హాల్ నిర్మించారు. కొన్నేళ్ల పాటు అందరూ కలిసి సజావుగానే నిర్వహించారు. ఈ క్రమంలో ఏడాది క్రితం నుంచి హమీద్‌కు తన బావమర్దులు ఉమర్, హనీఫ్‌తో ఆర్థిక పరమైన వివాదాలు తలెత్తాయి. ఈ పంచాయితీ పోలీసుల వద్దకు చేరింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు పోలీసులు పలుమార్లు పంచాయితీ నిర్వహించారు. కానీ వివాదం పరిష్కారం కాలేదు. దీంతో హమీద్ తాను చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి ఈ విషయమై తాడోపేడో తేల్చుకునేందుకు కొద్ది రోజులుగా సొంతూరు గరిమనపెంటలో ఉంటున్నాడు. అయితే ఫంక్షన్ హాల్‌ను నిర్వహించేందుకు పోలీసులను మధ్యవర్తులుగా పెట్టుకుని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆస్తి వివాదమై కోర్టులో కేసు కూడా కొనసాగుతోంది. శనివారం ఫంక్షన్ హాల్‌లో ఓ కార్యక్రమం జరుగుతున్న విషయం తెలుసుకున్న హమీద్ శుక్రవారం సాయంత్రం ఉదయగిరికి వచ్చి తన స్నేహితులతో కలిసి ఫంక్షన్ హాల్‌కు తాళం వేశాడు. ఈ విషయం తెలుసుకున్న హనీఫ్, ఉమర్ కత్తి, ఇనుపరాడ్‌తో ఫంక్షన్ హాల్ చేరుకున్నారు. లోపలికి పరిగెత్తు కుంటూ వెళ్లి ఒక్కసారిగా దాడి చేసి రాడ్, కత్తితో దారుణంగా హత్య చేశారు. దీంతో హమీద్ వెంట ఉన్న మిత్రులు భయభ్రాంతులతో పరుగులు తీశారు. అందులో ఒక యువకుడు ఈ హత్యను తన సెల్‌లో చిత్రీకరించారు. ఈ దారుణ హత్యతో ఉదయగిరి ఒక్కసారిగా ఉలికిపడింది. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోదిస్తున్న మృతుడి భార్య

కాకాణికి రెండు రోజుల పోలీస్ కస్టడీ



కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (లీగల్): ఎన్నికల సమయంలో ముత్తుకూరు మండలం పంటపాళెంలో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచారని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఇందుకూరుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అక్రమంగా నమోదు చేసిన కేసులో విచారణ నిమిత్తం శనివారం నుంచి రెండు రోజులు పోలీస్ కస్టడీకి ఇస్తూ నెల్లూరు స్పెషల్ ఎక్సైజ్ కోర్టు (ఇన్‌చార్జి) న్యాయమూర్తి నిషాద్ నాజ్ షేక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకాణిని 12వ తేదీ ఉదయం 8 గంటలకు విచారణ నిమిత్తం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి ఎక్సైజ్ అధికారులు కస్టడీకి తీసుకోవాలని, సాయంత్రం 5 గంటల వరకు విచారణ చేయాలని, 13వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఆయనకు వైద్య పరీక్షలు చేయించి మెడికల్ సర్టిఫికెట్‌తో కోర్టులో హాజరు పరచాలన్నారు. విచారణ సమయంలో థర్డ్ డిగ్రీ ఉపయోగించొద్దని ఉత్తర్వురులో పేర్కొన్నారు. న్యాయవాది సమక్షంలో గోవర్ధన్‌రెడ్డిని విచారణ జరపాలన్నారు. కాకాణిని కస్టడీ ఇవ్వాలని ఇందుకూరుపేట ఎక్సైజ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై పోలీసుల తరఫున ఏపీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ కేసులో గోవర్ధన్‌రెడ్డి పాత్ర ఉందని విచారించడానికి ఏడు రోజులు కస్టడీ అవసరం ఉందన్నారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమమహేశ్వరరెడ్డి, ఎంవీ విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు లేవని కేవలం రాజకీయ కక్షతో కేసులో ఇరికించారని పోలీస్ కస్టడీ ఇవ్వాల్సిన అవసరం లేదని వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి గోవర్ధన్ రెడ్డిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీ ఇస్తూ ఉత్తర్వులిచ్చారు.

వరదాపురం మైనింగ్ కేసులో నిరాకరణ

నెల్లూరు (లీగల్): పొదలకూరు మండలం వరదాపురంలోని భూముల్లో అక్రమ మైనింగ్ జరిపారని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పొదలకూరు పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. గోవర్ధన్‌రెడ్డిని పోలీస్ కస్టడీ కోరుతూ సబ్ డివిజన్ పోలీస్ అధికారి, నెల్లూరురూరల్ పోలీస్‌లు నెల్లూరు 5వ అదనపు జిల్లా (స్పెషల్ ఎస్సీ, ఎస్టీ) కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల తరఫున ప్రత్యేక పీపీ విజయమ్మ వాదనలు వినిపించారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, ఎంవీ విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి, తమ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఎస్. సరస్వతి పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను తిరస్కరిస్తూ విచారణకు నిరాకరించారు.

క్లుప్తంగా

'సోమశిల'లో అనుమానాస్పద వ్యక్తులు



సోమశిల: సోమశిల జలాశయం వద్ద గుర్తుతెలియని ఇద్దరు ఒడిశా వ్యక్తులు శుక్రవారం తారసపడ్డారు. జలాశయ లోతట్టు ప్రాంతాల్లో స్థానికంగా ఉండే చేపల వ్యాపారులు అలివి వలలతో వేట సాగించేందుకు గానూ ఒడిశా, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి ముఠాలను పిలిపించుకొని మత్స్య సంపదను కొల్లగొడుతూ భారీగా ఆర్జిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. వీరు ఎర్రచందనం స్మగ్లర్లా లేక అలివి వలల వేటగాళ్లనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రీ కౌన్సెలింగ్ ద్వారా ఏఎన్ఎంల బదిలీలు

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాలంటూ బదిలీలు నిర్వహించిన ఏఎన్ఎంలకు రీ కౌన్సెలింగ్‌ను శుక్రవారానికి పూర్తి చేశారు. మొత్తం 484 మందికి బదిలీల ప్రక్రియను జరిపారు. తమకు రీ కౌన్సెలింగ్‌ను జరపాద్దని పది రోజుల క్రితమే బదిలీ అయిన ఏఎన్ఎంలు ఎంత మొత్తుకున్నా, కలెక్టరేట్ వద్ద ధర్నా జరిపినా, అధికారులు పట్టించుకోలేదు. సచివాలయ పరిధిలోని 289 మంది గ్రేడ్ – 3 ఏఎన్ఎంలకు గ్రేడ్ – 2లుగా మూడు నెలల క్రితం ఉద్యోగోన్నతులను కల్పించి పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్లకు బదిలీ చేశారు. ఆపై పట్టణ ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఖాళీలను చూపారు. అయితే కమిషనరేట్‌లో ఏ మాయ చేశారో గానీ బదిలీ అయిన ప్రదేశాలకు ఉద్యోగోన్నతులు పొందిన వారు వెళ్లలేదు. పట్టణ ప్రాంతాల్లోని సచివాలయాల్లోనే ఉన్నారు. జీతాలను మాత్రం వైద్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలో తీసుకుంటున్నారు. ఈ తరుణంలో గ్రేడ్ – 3 ఏఎన్ఎంలకు రీ కౌన్సెలింగ్ జరిపి దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. తమకు అన్యాయం చేశారని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీసీపల్లిలో 723 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 723 బేళ్లను శుక్రవారం విక్రయించారని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 873 బేళ్లు రాగా, వాటిలో 723ను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. 83,414.7 కిలోల పొగాకును విక్రయించగా, రూ.1,73,58,615 వ్యాపారం జరిగిందని పేర్కొన్నారు. గరిష్ట ధర కిలో రూ.280.. కనిష్ట ధర రూ.159.. సగటు ధర రూ.208.10గా నమోదైందని వివరించారు. వేలానికి పది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



సీతారామపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. తాపీ పనులు చేసే సోంపల్లికి చెందిన గొల్లపల్లి సురేష్ (35) ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురంలోని ఓ మేస్త్రీని కలిసి తిరిగి ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి బయల్దేరారు. ఈ క్రమంలో అయ్యలూరివారిపల్లె వద్ద జాతీయ రహదారిపై గేదెను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు తరలించగా, వైద్యుల సూచన మేరకు తిరుపతి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్యతో పాటు ఐదుగురు కుమార్తెలున్నారు.

గేదెను ఢీకొని వాహనచోదకుడి దుర్మరణం



మనుబోలు: గేదెను బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మరణించిన ఘటన బద్దెవోలు పంచాయతీ పల్లెపాళెం రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. ఇందుకూరుపేట మండలం గంగపట్నానికి చెందిన లక్ష్మయ్య (22) మనుబోలు మండలం కట్టువపల్లి సమీపంలోని రొయ్యల గుంటల వద్ద పనిచేస్తున్నారు. బైక్‌పై పల్లెపాళెం వెళ్తుండగా, గేదెను ఢీకొనడంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. మనుబోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్:	119
లేయర్ లైవ్:	112
బ్రాయిలర్ చికెన్:	216
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	240
లేయర్ చికెన్	190



పొదలకూరు నిమ్మ ధరలు(కిలోల్లో)

పెద్దవి:	రూ.24
సన్నవి:	రూ.15
పండ్లు:	రూ.5



తిన్నోళ్లకు తిన్నంత అనారోగ్యం

- పలు రెస్టారెంట్లలో అధ్వానంగా తీరు
- నాసిరకమైన ఆహారం

నిన్న బొద్దింక.. తాజాగా బల్లి దర్శనం

- కానరాని అధికారుల తనిఖీలు

నగరానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల జీఎన్టీ రోడ్డులోని ఓ ప్రముఖ హోటల్ కెళ్లారు. ఇడ్లీని ఆర్డర్ చేయగా, కొద్దిసేపటికి టేబుల్ వద్దకు తీసుకొచ్చారు. ఆత్రుతగా తినాలని భావించిన ఆయనకు అందులో బొద్దింక దర్శనమిచ్చింది. ఈ విషయమై ప్రశ్నించగా, సదరు యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోలేదు. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినా అదే తంతు.

తాజాగా మరో వినియోగదారుడు రెండు రోజుల క్రితం అదే హోటల్‌కు భోజనం చేసేందుకు వెళ్లారు. అన్నంలో రసం పోసుకుంటుండగా, బల్లిని గుర్తించిన ఆయన కంగుతిన్నారు. సదరు హోటల్ సిబ్బందిని ప్రశ్నించగా, సమాధానం కరువైంది. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు అందడంతో, బల్లి పడిన రసాన్ని శాంపిల్ తీసుకొని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నగరంలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి.







రసంలో దర్శనమిస్తున్న బల్లి

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు హోటళ్లు నిబంధనలకు పాతరేస్తున్నాయి. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. సరైన ప్రమాణాలను పాటించకుండానే వినియోగదారులకు ఆహారాన్ని అందిస్తున్నాయి. ఈ పరిణామాల క్రమంలో తిన్నోళ్లకు తిన్నంత అనారోగ్యమొచ్చే అవకాశం ఉంది.

నిత్యం ఇంతే..

నగరంలో అనేక రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిల్లో అధిక శాతం కల్తీ ఆహార విక్రయాలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో అధికారులు పెద్దగా పట్టించుకోవడంలేదు. మాగుంట లేఅవుట్లోని ఓ హోటల్లో బిర్యానీని ఆన్‌లైన్ ద్వారా నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆర్డర్ చేశారు. ఇంటికొచ్చిన అనంతరం తెరిచి చూడగా.. అందులో పురుగులు దర్శనమివ్వడంతో అవాక్కయ్యారు.

అపరిశుభ్రంగా వంటశాలలు..

కొన్ని హోటళ్లలో వంటశాలలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కుళ్లిపోయిన మాంసం.. పాడైన కూరగాయలు తదితరాలను నిర్వాహకులు వినియోగిస్తున్నారు. ఆహార కల్తీ నియంత్రణ విభాగాధికారులు ఇటీవల జరిపిన దాడుల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. పెస్ట్ కంట్రోల్ చేయడం లేదని సమాచారం. నాణ్యత లేని ఆహారం తిని అస్వస్థతకు గురికావడం, హోటళ్లపై ఫిర్యాదులొచ్చినప్పుడే అధికారులు దాడులు చేస్తున్నారు. మిగిలిన సమయాల్లో అటువైపు కన్నెత్తి చూడటంలేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలోని ఆహార తనిఖీ విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కాగ్ నిబంధనల మేరకు పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రతి 50 వేల మందికి.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లక్ష మందికో ఆహార తనిఖీ అధికారి ఉండాలి. అయితే ఆ స్థాయిలో లేరు.

అదే నూనె.. మళ్లీ.. మళ్లీ వినియోగం

చికెన్ పకోడీ, బజ్జీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లలో కాగిన నూనెనే తరచూ వినియోగిస్తుండటంతో ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటోంది. వాస్తవానికి వంట నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ మోతాదు 25లోపు ఉండాలి. అంతకంటే ఎక్కువ శాతం మోతాదు కలిగిన నూనెను వినియోగిస్తున్నారు. వీటితో తయారు చేసిన ఆహారాన్ని తింటే గ్యాస్ట్రిక్, కేన్సర్ వంటి రోగాలొచ్చే అవకాశాలున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నాం



మా పరిధిలోని ప్రాంతాల్లో తనిఖీలను నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా 12 సార్లు తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే దానికంటే అధికంగానే చేపడుతున్నాం. లోపాలుంటే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నాం. మున్సిపాల్టీల్లో తనిఖీ చేసే అధికారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఉంది. పెస్ట్ కంట్రోల్‌ను సక్రమంగా చేస్తే బల్లులు, బొద్దింకల్లేకుండాపోతాయి. ఈ విషయాన్ని యాజమాన్యాలకు తెలియజేస్తూనే ఉన్నాం.

– వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్

ఉత్సాహంగా రెవెన్యూ క్రీడలు

జిల్లా రెవెన్యూ క్రీడోత్సవాలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అట్టహాసంగా శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ ఆనంద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ తదితరులు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన, జాతీయ, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. శాంతి కపోతాలను ఎగురవేశారు. క్రీడాకారుల గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లాలో పనిచేసిన సమయంలో క్రీడాపోటీల్లో రెండుసార్లు పాల్గొన్నానని, మూడోసారి ఇక్కడ హాజరుకావడం సంతోషంగా ఉందని చెప్పారు. – నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ తదితరులు



పరుగుపందెం



వాలీబాల్‌లో తలపడుతూ..



హ్యాండ్‌బాల్ విసురుతూ..

ధాన్యం కొనుగోళ్లకు సహకరించండి



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు (పొగతోట): రానున్న సీజన్లో రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలుకు సహకరించాలని డీఎస్‌ఓ విజయ్‌కుమార్, సివిల్ సప్లయ్స్ డీఎం అర్జున్ రావు కోరారు. నగరంలోని పౌరసరఫరాల కార్యాలయంలో రైస్ మిల్లర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత సీజన్లో ధాన్యం కొనుగోళ్ల విషయమై పీపీసీల్లో ఏర్పడిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వీటిని పరిష్కరించి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని పరిశీలించే పరికరాలను ఎలాంటివైతే ఏర్పాటు చేశారో అవే రైస్‌మిల్లుల్లో ఉండేలా చూడాలని సూచించారు. సీఎమ్మార్‌కు సంబంధించిన బ్యాంక్ గ్యారెంటీలను రైస్‌మిల్లర్లు తప్పక ఇవ్వాలని చెప్పారు. ధాన్యం వాహనాలు మిల్లులకొచ్చిన అనంతరం ఆరు గంటల్లో అన్‌లోడ్ చేయాలని, వీటికి జీపీఎస్ తప్పక ఉండాలన్నారు. అనంతరం రైస్ మిల్లర్ల నేతలు మాట్లాడారు. రూ.150 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని చెల్లిస్తే సీఎమ్మార్‌కు ముందుకొస్తామని వివరించారు. సమస్యలను మంత్రి దృష్టికి ఆర్నెల్ల క్రితమే తీసుకెళ్లినా, నేటికీ పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బాలసదన్‌లో పరిశీలన

నెల్లూరు (పొగతోట): ఆదరణ లేని ఆడపిల్లలు, నిర్లక్ష్యానికి గురైన పిల్లలను బాలసదన్‌లో చేర్పించి వారికి రక్షణ కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ పద్మావతి సూచించారు. బాలసదన్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. సెల్‌ఫోన్ దొంగతనం నెపంతో ఇబ్బందులకు గురైన పాపను పరామర్శించారు. బాలసదన్ రికార్డులు, భోజనాన్ని పరిశీలించారు.

వసతిగృహ సంక్షేమాధికారులతో సమావేశం



మాట్లాడుతున్న శోభారాణి

ఉదయగిరి: జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి పేర్కొన్నారు. ఉదయగిరి డివిజన్ పరిధిలోని వసతి గృహ సంక్షేమాధికారులతో స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వసతిగృహాల్లో 100 మంది చొప్పున విద్యార్థులను చేర్పించాలని సూచించారు. కొన్ని చోట్ల 35 నుంచి 75 మందే ఉన్నారని, నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 64 వసతిగృహాల్లో మరమ్మతు పనులు జరుగుతున్నాయని, ఇవి 85 శాతం మేర పూర్తయ్యాయన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పీహెచ్‌సీ వైద్యులతో ఆరోగ్య పరీక్షలను ప్రతి నెలా నిర్వహించాలని సూచించారు. మెనూ మేరకు భోజనాన్ని అందించాలని కోరారు. ఏఎస్‌డబ్ల్యూఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలు రూ.వెయ్యి ఇవ్వాల్సిందే..!

- ఎమ్మెల్యే ప్రోగ్రామ్ అంటూ హుకుం
- నేడు వెలుగు ప్రాజెక్ట్ 25 వసంతాల కార్యక్రమం
- చిన్న ఉద్యోగుల నుంచి చందాలేమిటంటున్న వైనం

ఉలవపాడు: సాధారణంగా ఏదైనా ప్రభుత్వ కార్యక్రమమైతే ప్రభుత్వమే నిధులిస్తుంది. అదే పార్టీ ప్రైవేట్ ప్రోగ్రామైతే పార్టీ కార్యకర్తలు, నేతలే ఖర్చును భరిస్తారు. అయితే ఉలవపాడులోని వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ ఖర్చును భరించడం వీఓఏల వంతైంది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వస్తున్నారు.. రూ.వెయ్యి చొప్పున ఇవ్వాలని హుకుం జారీ చేశారు. వెలుగు ప్రాజెక్ట్ 25 వసంతాలైన సందర్భంగా ప్రత్యేక ప్రోగ్రామ్‌ను శనివారం నిర్వహించనున్నారు. మండల పరిధిలోని 45 మంది వీఓఏలు రూ.వెయ్యి చొప్పున ఇవ్వాలని చెప్పడంతో, ఇబ్బందులు పడుతూ. తిట్టుకుంటూనే అందించారు.

మహిళా నేతల పెత్తనం

గ్రామ సంఘం, మండల సమాఖ్యలో డబ్బులుంటాయి. అయితే వీటిని వాడకుండా తమ వద్ద వసూలు చేయడమేమిటని వీఓఏలు పేర్కొన్నారు. మండల సమాఖ్యలో కూటమి మహిళా నేతల పెత్తనం ఎక్కువైందని ఆరోపిస్తున్నారు. గతంలో ఎమ్మెల్యే కార్యక్రమాల సమయంలో అధికారులు ప్రభుత్వ నిధులతో పాటు, అధికారంలో ఉన్న పెద్ద నేతలను అడిగి చేసేవారు. అయితేప్రస్తుతం రూ.వెయ్యి తేవాలని, లేకపోతే వీఓఏలు ఉండరని చెప్పడంతో పాటు పాత వీఓఏలందరూ ఎమ్మెల్యే లెటర్ తెచ్చుకోవాలంటూ మండల సమాఖ్యలో ఉన్న తెలుగు మహిళా నేతలు బెదిరిస్తున్నారని సమాచారం.

కువైట్‌లో ఉద్యోగావకాశాలు

నెల్లూరు (పొగతోట): కువైట్‌లో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన 25 నుంచి 50 ఏళ్లలోపు అనుభవం కలిగిన వారు అర్హులని చెప్పారు. కువైట్‌లో రెండేళ్ల పాటు వారానికి ఆరు రోజుల చొప్పున నిత్యం తొమ్మిది గంటలు పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. ఇంగ్లిష్, హిందీ మాట్లాడగలిగి ఉండాలని, ఇంటర్వ్యూ, టెక్నికల్ స్కిల్స్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారని తెలిపారు. మూడు నుంచి ఐదేళ్లలోపు అనుభవం ఉన్న వారికి ఉచిత వసతి, రవాణా, వైద్య సదుపాయంతో విమాన టికెట్లను నిర్మాణ సంస్థే భరించనుందని వెల్లడించారు. సిరామిక్ ఫ్లోరింగ్ సూపర్‌వైజర్‌కు రూ.70 వేలు, వర్కర్‌కు రూ.58 వేలు.. పెయింటింగ్ సూపర్‌వైజర్‌కు రూ.70 వేలు, వర్కర్‌కు రూ.56 వేలు.. ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్‌కు రూ.70 వేలు.. వర్కర్‌కు రూ.56 వేలు.. సీలింగ్ సూపర్‌వైజర్‌కు రూ.70 వేలు, వర్కర్‌కు రూ.56 వేల వేతనాన్ని ఇవ్వనున్నారన్నారు. ఆసక్తి గల వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టుతో శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 79896 13024, 87901 18349 నంబర్లను సంప్రదించాలని సూచించారు.